# నరుసు

ఆమె ముంగురుల విన్యాసానికి ప్రపంచం పులకితమౌతుంది. ఆమె కంటి కొనచూపుల కాంతికి జగతి దిగ్భ్రమచెందుతుంది. ఆమె నవ్వ వెన్నెలలో ప్రకృతి తన్మయం చెందుతుంది.-

ఆమె నవనవోన్మేష సౌందర్య కాంతి చూసి సౌందర్యమతోపాసకుడు కాని వేదాంతి లేడు. ఆమె హావభావ విలాసములకు ముగ్ధుడు కాని యువకుడు లేడు. ఆమె మృదులగళమునుండి విలాసముగావచ్చు మధురగీతి విని పులకితుడు కాని గాయకుడు లేడు-

ఆమె ప్రకృతి యొడిలోని ముద్దుల మూట- ప్రకృతికి పెట్టని ఆభరణము జీవము- సర్వమూ......

కాని-......

తెలివి తక్కువ హిందూసంఘమామె సౌందర్యమును చూసి కంట నిప్పులు పోసుకున్నది, ఆమెకు సహజముగా అలవడిన లలిత కళలను చూసి అసూయ చెందినది. మానవ సహజములైన ఆమె అభిరుచులనూ, కోర్కెలనూ ధ్వంసమొనరించినది... తుదకామె సుకుమారజీవిత కుసుమము సంఘ రాక్షసి క్రూరదంష్ట్రలలో పడి పిప్పియై విషాదాంతమైనది.........

***

ఆడపిల్లలు లేకపోవడంవల్ల డాక్టరు రామయ్య దంపతులు నోచిన నోములకీ చేసిన వ్రతాలకీ ప్రతిఫలమే "నరుసు" వాళ్ళ వుపాసన దైవమైన లక్ష్మీనరసింహస్వామి పేరే లక్ష్మీనరసమ్మగామార్చి పెట్టారు ఆపిల్లకి. తల్లిదండ్రులు ముద్దుగా నరసూ, అని పిలవడం చేతనూ, వుచ్చారణ సౌలభ్యంగా వుండడంచేతనూ, యింట్లో వాళ్లూ పై వాళ్ళూ కూడా నరుసనే పిలిచే వాళ్లాపిల్లను.

పువ్వు వికసించగనే పరిమళం తెలుస్తుంది, అనే లోకోక్తి నరుసులో అక్షరాలా సార్థకమైయుంది. పుట్టగానే అమ్మలక్కలంతా చుట్టూచేరి 'చిదిపిదీపం పెట్టవచ్చునమ్మా అంత చక్కటిపిల్ల! అన్నారు. పిల్ల పెరుగుతూవున్న కొద్దీ తల్లి తండ్రులకీ యిరుగు పొరుగువాళ్లకీ ప్రేమాభిమానాలు పెరుగుతూవచ్చినవి. ఆటలాడుకునే కాలంలో నరుసు ఏపొరుగింటికి వెళ్లినా వాళ్ళందరికీ యేదో వొక పెద్ద వెలుగు తమ్మావరించి నట్టనిపించేది. "సంచారిణీ దీపశిఖ" అన్నా కాళిదాసుని అనుకునేవాళ్లు యిరుగు పొరుగు పండితులు.

అందానికి తగిన తెలివితేటలూ చురుకుతనమూ వుండంచేత నరుసు పద్నాల్గేండ్లకే స్కూలు ఫైనలు పాసయింది సంగీతంలో కూడ మంచి జ్ఞానాన్ని సంపాదించింది. ఉదయమూ, సాయంత్రమూ వసారాలో కూర్చొని వీణ వాయిస్తూ నరుసు ఆలాపించిందంటే స్వర్గలోకంనుంచి ఏ కిన్నర కన్నెవచ్చి పాడుతున్నాదో అనిపించేది. త్రోవంట పోయేవాళ్ళంతా నాగస్వరంచేత ఆకర్షింపబడె పాముల్లాగు ఆకర్షింపబడేవాళ్లు ఆమధుర గాత్రం నుంచి చల్లగావచ్చే తేనె ధారలాంటి ఆగానాన్ని, అప్పుడే వికసిస్తూవున్న ఎఱ్ఱ గులాబి మొగ్గల్లాగు మనోజ్ఞమైన ఆమె శరీర లావణ్యాన్ని

"శ్రీ అవతార్"

తనివితీర త్రాగుతూ మైమరచి నిలుచునేవాళ్లు పాటసాంతం అయేవరకూ.

***

"ఇప్పటికే నలుగురూ నాలుగు మాటలంటున్నారు. ఇకనైనా పెళ్లి చెయ్యరూ అమ్మాయికి" అన్నాది శాంతమ్మ గారు, తమలపాకు చిలకలు అందిస్తూ.

'అలాగే చూద్దాము లే యీ వైశాఖమాసంలో. ఇంతో అంతో చదువుతున్న పిల్లకదా, మరి దాని వుద్దేశంగూడా కనుక్కోవద్దూ?' అన్నారు రామయ్యగారు, పళ్లెంలోని ఏలకపండు తీసి తొక్కవలుస్తూ.

'హరిమీదగిరిపడ్డా యీ వైశాఖంలో పెళ్ళి చెయ్యకపోతే మన 'అబ్బోరు' దక్కదు సుమండీ, ఇష్టా ఇష్టాలు తర్వాత చూసుకోవచ్చు అన్నది ఆవిడ.'

పోనీ యెందుకైనా మంచిది. మెల్లగా యీ వూసుదాని దగ్గర యెత్తి, ఏమంటుందో చూద్దాం. నరీ చిన్నపిల్ల కాదుకదా, ఎవరి మీద యిష్టంవుందో తెలుసుకొని పెళ్లి చెయ్యడం మంచిది. పెళ్ళి చేసుకొనేది అది కాని, నువ్వూ నేనూ కాముకదా అన్నారు ఆయన, నవ్వుతూ.

వెంకట్రావు స్లిప్పర్లు టకటక లాడించి కుంటూ వచ్చాడు తల్లి తండ్రులదగ్గరికి 'నాయనా! చూడరా చెల్లికి పెళ్ళి చెయ్యమంటూవుంటే రోజు రోజు గడిపేస్తున్నారు మీనాన్నగారు' అన్నది తల్లి వెంకట్రావుతో.

'అయితే సంబంధం స్థిరపడిందా' అన్నాడు వెంకట్రావు 'లేదు, అదే ఆలోచిస్తున్నాము, ఏదీ తోచలేదు' అన్నారు రామయ్యగారు.

'నా క్లాసు మేటుశంకరం అనే కుర్రాడు. వున్నాడు. అతను మనశాఖే. మంచి ఆస్తివుంది. ఇంకా పెళ్లి కాలేదు' అన్నాడు వెంకట్రావు తండ్రివేపు ప్రశ్నాపూర్వకంగా చూస్తూ.

'కుర్రాడు బాగా వుంటాడురా ?' అని అడిగింది శాంతమ్మగారు. 'అతని బొమ్మ చూపిస్తానుండు మాగ్రూపు ఫోటోలో వుంది' అని వెంకట్రావులేచి గోడనున్న ఫోటోతీసి అతని బొమ్మని చూపించాడు, తల్లికి.

'కుర్రాడు తెల్లగానే వున్నట్టుందిరా అబ్బాయీ!' అన్నది ఆవిడ. 'తెల్లగా బాగా వుంటాడమ్మా' అన్నాడు వెంకట్రావు. 'ఇందులో యేమి తెలుస్తుంది Single ఫోటో వుంటే తీసుకురావోయి చూద్దాం మీ చెల్లెమ్మకి కూడా చూపించాలి కదా' అన్నారు రామయ్యగారు.

***

ఇది జరిగిన మర్నాడే వెంకట్రావు శంకరం ఫోటో తెచ్చాడు. రామయ్యగారు దాన్ని నరసుకు చూపించి అది గారు 'ఫోటోకేమి బాగానే వుంది' అన్నది నరసు. 'అదికాదే, యితన్ని, పెళ్లాడ్డం నీ కిష్టమేనా అని అడుగుతున్నారు మీ నాన్నగారు' అన్నది శాంతమ్మగారు.

ఇష్టంలేదు అన్నట్టు తలవూపింది నరసు,

'ఏమీ బాగులేదా ఏంటి' అన్నది తల్లి.

'బాగు లేకేం, బాగానే వున్నాడు?' అన్నది నరసు.

'అయితే ఎందు కిష్టంలేదూ' అన్నది తల్లి.

'ఏమో నాకిష్టంలేదు' అన్నాది నరసు.

'ఇంకెవర్ని పెళ్ళి చేసుకోవాలని వుంది? సుందరం మామయ్యను పెళ్ళాడుతావా?' అన్నారు రామయ్యగారు నవ్వుతూ. తిరస్కార సూచకంగా తలవూపింది నరసు.

'మరి యింకా ఎవర్నే పెళ్లి చేసుకుంటావు' అన్నది శాంతమ్మగారు విసుగుతో.

తల్లి దండ్రుల వైపు కొంటెగా చూసి "కృష్ణారావు—" అని వూరుకుంది నరసు చెక్కిళ్లు యెఱ్ఱబారిన సిగ్గుతో.

'ఆఫ్లీడరుగారి కృష్ణారావునా' అని త్రుళ్ళిపడి అరిచారు రామయ్యగారు.

'మన బంధువా' లేకపోతే మన శాఖవాడా? ఎలావుందే యిలాంటి

గొంతెమ్మ కోరిక కోర్తే' అన్నది శాంతమ్మగారు. నరుసు విచారంతో మొఖం దించుకొని లోనికిపోయింది. శాంతమ్మగారూ, రామయ్యగారూ వొకరి మొఖం వొకరు చూసుకొని నచ్చరపోయారు.

***

సనాతన సంప్రదాయానికి విరుద్ధంగా రామయ్యగారు తన కూతురికి చదువు సంగీతం చెప్పించడం ఆవూళ్లో వున్న కొన్ని ఛాందస కుటుంబాలికి యిష్టంలేదు. నరుసు చదువుగురించి గాని సంగీతం గురించిగాని ఎవరైనా ఎత్తితే అసూయచేత వాళ్ళవొళ్లు మండిపోయేది...అంత చక్కటిపిల్లను తమకోడలిగా చేసుకుందామనే కోర్కెవున్నా వైదికవిద్యను నేర్చే తమ పిల్లలకిచ్చి పెళ్ళిచెయ్యరనే భావంచేత యీర్ష్యతోవున్న కొందరు ధనవంతులైన ఛాందసులూ లేకపోలేదు. ఏనాడైతే పెళ్లి సంబంధం గూర్చి రామయ్యగారు నరుసుతో ఆలోచించారో ఆనాటినుంచీ ఛాందస కుటుంబాలలో గుసగుసలు బయలుదేరినాయి. మరి నాలుగురోజులుకల్లా రామయ్యగారు శాఖాంతర వివాహం చేస్తారనీ, సనాతనులంతా ఆ వివాహానికి అడ్డుతగులుతారనీ, స్వాములవారి దగ్గరనుంచి ఆంక్షాపత్రం తెప్పిస్తారనీ, చాకిల మంగళ్ళను వాళ్ళింటికి వెళ్లకుండా బాయ్‌కాట్ చేస్తారనీ, పుకారు పుట్టింది వూళ్ళో. ఆనోటా, ఆనోటా తిరిగి రామయ్యగారివరకూ వచ్చింది. యీ ఖబురు ఛాందసులకు మూతికట్టుకట్టి తన ముద్దుల కూతురు కోర్కె నెరవేరుద్దామనుకుంటూవున్న రామయ్యగారికీవార్త అశనిపాతం అయింది. సంఘానికెదురీది తన కార్యం సాఫల్యము చేసుకొనేశక్తి చాలదతనికి. ఎంతమాత్రం సంఘానికి ఎదురు వెళ్ళినా సంఘరాక్షసి తన భీకర హస్తాలతో ఎత్తి తన కఠోరదంష్ట్రలతో పిప్పిచేస్తుందనే భయం వుందతనికి. సంఘభీతివల్లనూ, పెళ్లయిన తర్వాత నరుసు మనసు మార్చుకొని సుఖిస్తుందనే ఆశవల్లనూ చివరకు శంకరం సంబంధమే స్థిరపరచారు.

...కాని నరుసు హృదయం మాత్రం ఆవేదన పూరితమైపోయినది. చిన్నప్పటినుంచీ కృష్ణారావూ తాను ఆడుకున్న ఆటల్నీ, తనకురాని పాఠాల్ని అతను తన సహజమృదు మధుర స్వరంతో చక్కగా బోధించినపుడు తాను పొందిన మనోవికాసాన్నీ, ఒకనాడు తాను కృష్ణారావుకి పుస్తకాన్ని అందిస్తూవుంటే అతని చెయ్యి తనచేతికి ఎలక్ట్రిక్ షాక్ (electric shock)లా తగిలినప్పుడు తానుపొందినత్రపా సంబంధమైన అవ్యక్తానందాన్నీ, తలచుకొనికుళ్లి కుళ్ళి యేడ్చింది. తనకు తెలీకుండా తన్ను చుట్టివేసిన ప్రేమపాశం యొక్క బలాన్ని తెలుసుకున్నది. తండ్రి మాట అనుసరించి సహజమూ పవిత్రమూ అయిన తన ప్రేమలతను మొదలంట నాశనం చెయ్యడమూ, లేక ధైర సాహసాలతో తండ్రినీ సంఘాన్నీ ధిక్కరించి న్యాయభూతమైన తన కోర్కెను గౌరవించడమూ అన్న సమస్యను తేల్చలేక ఆవిడమనస్సు వాతాచలితమైన చిగురాకు లాదీనమైవుంది. తన వివాహాన్ని గురించి తన తండ్రికికాని సంఘానికిగాని వున్న హక్కేమిటి? అని తన మనస్సును ప్రశ్నించింది— మనస్సు జబాబు చెప్పలేక వూరుకుంది— ...ఏనాడు తన మనస్సు అప్రయత్నంగా తనకు తెలీకుండానే కృష్ణారావు వశమైందో ఆనాడే తన సర్వస్వమూ అతని అధీనంగా అయినట్టు భావించినది. కాని తన్ను తాను రక్షించుకునే ధైర్యమూ సాహసమూ తనకులేదని గ్రహించింది. తన అభిలాషనూ, అసహాయతనూ తెలుపుతూ అతనికి తన్ను వివాహంచేసుకునే కోర్కె వున్నట్టయితే రక్షించుమని వుత్తరం రాసి దాసీ దాని ద్వారా అతనికి అందచేసింది.

నాలుగు రోజులతర్వాత. ఉదయం 9 గంటలవేళప్పుడు— రామయ్యగారి యింట్లో బాజాలు వాగుతున్నాయి. ఎక్కడచూసినా కలకమే. వచ్చే చుట్టాలకీ స్నేహితులికీ అంతు

లేదు. అందరినోటంటా: రాత్రి జరుగు వివాహం గురించే మాటలు వినవస్తున్నాయి... ...ఒక మోటారు కారు వచ్చి గుమ్మంముందు నిలిచింది. నరుసు నలుగురు పేరంటాళ్ళతోవచ్చి కారెక్కింది. కారు భీషణావరం చేస్తూ కదలిపోయింది.... మధ్యాహ్నం రెండు గంటలవరకూ నరుసు ఊసు ఎవరూ ఎత్తనేలేదు. పైవూరునుంచి వచ్చిన చుట్టాలతోటీ, స్నేహితులతోటీ మాట్లాడుతుంది కాబోలు అనుకున్నది శాంతమ్మగారు. పెళ్ళికూతుర్ని ముస్తాబుచెయ్యడానికి కబురుపడింది. చుట్టాలకిచ్చిన విడిది గదులన్నీ గాలించారు. కాని నరుసు కనబడలేదు. పెద్ద 'గంద్రగోళం' జరిగింది. చూసిన వాళ్లు చెప్పారు నరుసు పేరంటాళ్లతో వుదయం 9 గంటలప్పుడు కారెక్కి వెళ్లిందని. ఈ సంగతి రామయ్యగారికి తెలిసింది. ఆయన గాభరాతో పోలీసు స్టేషనుకు వెళ్లి రిపోర్టు చేశాడు జరిగిన సంగతి యావత్తూ—.

***

ఆవేళే; సాయంత్రం 6 గంటలవేళ సబ్ యినస్పెక్టరు మాధవరావు నాయుడు నలుగురు రక్షకభటులతోనూ బేడీలు వేయబడిన కృష్ణారావు ప్రభృతులతోనూ వచ్చాడు రామయ్యగారింటికి నరుసును తీసుకొని. కృష్ణారావు పసుపు బట్టలతో వున్నాడు. అతని స్నేహితుల్లో వొకడు పురోహితుడి వేషంతోనూ నలుగురు పేరంటాళ్ళ వేషాలతోనూ వున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో "నరుసుకీ" కృష్ణారావుకీ వివాహం జరుగుతోవుందని మంగళసూత్ర ధారణ వేళకు తాను వెళ్ళేనని కృష్ణారావు స్నేహితులంతా కట్టలు కట్టుకొనివచ్చి తన్ను అడిగేశారని ఆఖరికి రివాల్వరు ద్వారా కార్యం సాధించేననీ వాళ్ళందరికీ కసిదీరా కఠిన శిక్షను వేస్తానని చెప్పి నరసును రామయ్యగారికి అప్పగించి వెళ్లాడాయన. నలుగురూ నాలుగుమాటలన్నారు నరుసును. స్త్రీ బుద్ధి ప్రళయాంకరీ, అన్నారు కొందరు. అందమైన ఆడదానికి చదువేమిటి పాడు చెయ్యడానికి కాకపోతే; అన్నారు కొందరు. రామయ్యగారు నరుసును గట్టిగా నాలుగు చీవాట్లు పెట్టారు. శాంతమ్మగారు కోపందీర బుగ్గలు నులిపి రెండు లెంపలు వాయించింది. నరుసు మాత్రం గంభీరంగానూ నిశ్చలంగానూ వుంది- ఆ వేళకు మాత్రం పెళ్లి నిలిచిపోయింది- ఈ సంఘటన చూసి రామయ్యగారిని బెదరించి డబ్బు పిండుదామను కొన్న సనాతన ఛాందసులుమాత్రం కొందరు లేకపోలేదు.

మర్నాడు వుదయం. శాంతమ్మగారు నరుసును లేపడానికి నరుసున్న గదిలోనికి వెళ్లింది. గదిలో నరుసు లేదు. తలగడమీదమాత్రం ఒక వుత్తరం వుంది. విహ్వలహృదయంతో ఆ వుత్తరాన్ని తెచ్చి రామయ్యగారి కిచ్చింది. దాన్ని విప్పి ఆయన కన్నీటి కళ్లతో యిలా చదివారు.—

నాన్నా?

నన్ను ఎంత ప్రేమతో పెంచి పెద్ద దాన్ని చేశావో అంత క్రూరంగా హింసించి హతమార్చావు. చదువుకున్న నీకే ఛాందసులదగ్గరా, సంఘం దగ్గరా భయంవదలకపోతే చదువుకోని వాళ్ల మాట యేం చెప్పాలి?

నాన్నా...... ఒకమాట చెప్తాను కోపగించవు కదూ!

ఆవేళ మనయింట్లో శాస్త్రుల్లుగారు రుక్మిణీకల్యాణంలో రుక్మిణిని కృష్ణుడు ఎత్తుకొనిపోయిన ఘట్టాన్ని చదువుతూ రుక్మిణీ కృష్ణుల పవిత్ర ప్రేమను గూర్చి ఎంత పొగిడారో జ్ఞాపకంవుందీ? నువ్వూ నీచుట్టూ కూర్చున్న ఛాందసులూ ఎలా తలలాడించి ఆనందం పొందేరో మరిచిపోయావా?

మనం కృష్ణా సినీమాలో దక్షయజ్ఞం ఫిల్ము చూస్తూ ద్రాక్షాయణిని శివుడు ఎత్తుకొనిపోతే ఎంత సంభ్రమపడ్డామో జ్ఞాపకంవుందా? ఆయా ఘట్టాలలో నాయికా నాయకులు పొందిన హృదయ పరిణామాన్ని అవ్యక్తానందాన్ని పొందలేదూ! అజ్ఞానులుగా నున్నపిల్లలూ ఆసమయంలో చప్పట్లుకొడితే నువ్వుకూడా నీపదవిని మరచి చప్పట్లుకొట్టేవే!... నావిషయంలో అభినందించక పోవడమే

కాకుండా సహనంకూడా చూపలేక పోయావే వాళ్ళింకా దేవతలంటావేమో? అంతమాత్రాన తప్పిపోలేవు సుమా! —

రాణీసంయుక్తను పృథ్వీరాజు తీసుకొనిపోయిన ఘట్టాన్ని చూసి, నువ్వూ, నువ్వు సేవిస్తూవున్న తెలివితక్కువసంఘమూ ఆనందభాష్పాలను రాల్చలేదు? ఇంతెందుకూ మొన్న మొన్న మనప్రాంతాలలోనే వొక రాజకుమారుడు తండ్రిమాట ధిక్కరించి రాజ్యాన్ని వదలివేసి తన ప్రేమనిధానాన్ని తీసుకొని మదరాసుపోతే హర్షించలేదూ నీ గ్రుడ్డిసంఘం?

నీలాంటి అమాయిక హృదయాల మీద కానిన హృదయాలమీదా అధికారం చెలాయిస్తూవున్న సంఘం యిలాంటి సంఘటనను చదివేటప్పుడూ సినీమాలో చూసేటప్పుడూ హర్షిస్తుంది. కాని తన యెదుట జరుగుతూవుంటే కంట నిప్పులు పోసుకుంటుంది ఆ కార్యనిర్వాహకులు (సంఘభీతి గలవారైతే) వాళ్ళను తనభీకర దంష్ట్రిలతో పిప్పిచేస్తుంది.

ఒకమాట చెప్పియింకొకపని చేసే యీఅర్థంలేని అవినీతిసంఘాన్ని నమ్ముకొని ఎన్నాళ్లు బ్రతుకుతారు నువ్వూ నీ అసూయాయులూ?

...... నాన్నా ... తెల్లవారిన తర్వాత నాశవాన్ని పెరటి నూతిలో చూసి నీ శని విరగడైపోయిందనుకుంటావు కదూ......?

...నాన్నా మళ్లీ నిన్నుచూడలేను కదూ:?......

నాతో మరిమాట్లాడవుకదూ?...

నాన్నా......నాకోసం వొక్కపనిచేసి పెట్టవూ?......మళ్లీ మీ నరుసుని యీ దౌర్భాగ్యపు తెలివితక్కువహిందూసంఘంలోపుట్టకుండా చెయ్యమని దేవుడ్ని ప్రార్థించవూ? ......నాన్నా...నాకడసారికోర్కె తీర్చవూ...?

"నరుసు"


## జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహసౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0 తపాలఖర్చులు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టినవల వెలువడలేదు అపరాధాన్వేషకము అత్యద్భుతము. గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,
సౌకారుపేట, మదరాసు.

## లీలా

లేక

## సురేంద్ర నగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీగ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు 1-0-0

ఆర్యా బుక్ డిపో,
19, తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళిక్కేణి, మదరాసు.